కథ

భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో
సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ.



# జడ్జిమెంట్

అల్లంశెట్టి అరవింద్

“ఎడ్వాన్స్‌డ్ కంగ్రాచ్యులేషన్స్”రామారావుమాస్టరుగారు చెయ్యి ముందుకు చాపారు. ఎందుకో తెలీకపోయినా నేను గూడ చెయ్యి అందించాను.

“నీ మల్టీ ప్రొజక్టరును బెస్ట్‌టీచర్ ఎగ్జిబిట్‌గా సెలెక్టు చేశారు.”

“అదేంటి? రంగాచారిగారి టెలిఫోన్ ఎక్స్‌ంజికి అనుకొన్నారు కదా.”

“మొదటి నిర్ణయం అదే. అది అయిదు లైన్లటెలిఫోన్ మాన్యువల్ ఎక్స్‌ంజి. రంగాచారి బ్రదరు టెలిఫోన్ ఎక్స్‌ంజిలో పని చేస్తున్నాడు. ఈ ప్రోజెక్టులో అతని సహాయం చాలా వుంది. పరికరాలు గూడ అతనే ఇచ్చాడు. రంగాచారి బాగా డబ్బుఖర్చు పెట్టాడు. హెడ్ మాస్టర్ని ఇన్‌ఫ్లుయన్స్ చేసి ఒక రూమ్ ప్రత్యేకంగా తీసుకొన్నాడు. అందులో ఈ షో చేస్తున్నాడు. ఈ హెడ్‌మాస్టరు స్ట్రిక్టు అంటారు గాని వీడూ

అందరిలాంటివాడే. మనకి నాలుగు స్కూళ్లకి ఒక గది ఇచ్చి వాడొక్కడికే ఒక గది ఇచ్చాడు చూశావా? లోకంలో న్యాయం లేదు బ్రదర్. అసలు ఎగ్జిబిట్స్ ఎరేంజి చెయ్యక ముందే రంగాచారికి ప్రైజ్ నిర్ణయం అయిపోయింది. ముగ్గురు జడ్జీలూ ఇక్కడి కాలేజిలో పనిచేస్తున్న లెక్చరర్లే. అందులో ఒకడు ఆచారి, వీడికులంవాడే. ఫిజిక్స్ లెక్చరర్. మిగిలిన ఇద్దర్లో ఒకడు జువాలజీ లెక్చరర్. నేచురల్ సైన్సు ఎగ్జిబిట్స్ చూస్తాడు. మూడవవాడు కెమిస్ట్రీ. డి.ఇ.ఓ.కి సైన్సు అంటే అభిమానం. బోటనీలో పి.హెచ్.డి. ఈ సైన్సు ఫెయిర్ ఇంత చక్కగా జరగడానికి ఆమే కారణం. ఆవిడ రికమండ్ చెయ్యకపోతే నీ మల్టీ ప్రొజక్టరును చూసేదెవ్వరు? బాధపడుతున్నావా? కాని నిజం బ్రదర్. నేను కుండ బద్దలు గొట్టినట్లు మాట్లాడతాను. ఇప్పుడు చూడు ఎంతమంది నిన్ను అభినందించడానికి వస్తారో. ఆ ! ఫిజిక్సులో గూడ మీ స్కూలుకే అనుకొంటాను. డైరెక్టు విజన్ స్పెక్ట్రోస్కోప్.

డైరెక్టు విజన్ స్పెక్ట్రోస్కోపా ? మా స్కూలే. రమణకుమార్ చేశాడు. తెలివైనవాడు. చెప్తే చటుక్కున గ్రహిస్తాడు. టెంత్ చదువుతున్నాడు. ఇంతకీ ఇవన్నీ నీకెలా తెలుసు? జడ్జిమెంటు అప్పుడే తెలిసి పోయిందా ?

ఒక్కొక్కప్పుడు అతి రహస్యాలనుకొన్నవి సులువుగా లీకయిపోతాయి. అన్నట్టు సభ్యత్వం ఎంత వరకు వచ్చింది?

నెలాఖరుకు పూర్తయిపోతుంది. ముగ్గురు చేరారు. వాళ్లు ఆచారి వర్గం.

"మళ్లీ కలుస్తా. అందరినీ చూడడానికి ఇదే సమయం. ఒక రౌండేసి వస్తా. నువ్వు నీ రూమ్‌లో వుండు. కొందరికైనా నువ్వెవరో తెలియాలి కదా !"

మా విద్యార్థులు ఎగ్జిబిట్స్ ఒక్కొక్కటీ ఎలా పనిచేస్తుందో చక్కగా వివరిస్తున్నారు. పని చేయించి చూపిస్తున్నారు. చూడడానికి వచ్చినవారు కొందరు ప్రశ్నలు వేస్తున్నారు. పిల్లలు గూడ తగిన సమాధానాలు చెప్తున్నారు.

రమణకుమార్‌ని అడిగాను ''ఏం జరిగిందిరా" అని

''ముందు ముగ్గురు మాస్టరులు వచ్చారుసార్. ఒక్కొక్కటీ చూసి పేరు, తయారుచేసిన వారి పేరు, క్లాసు రాసుకొన్నారు. బాలరాజు ప్రొజక్టరు వేసి చూపించాడు. స్పెక్ట్రోస్కోపు నేను చూపించాను. స్పెక్ట్రోస్కోపు తీసుకొని ఒకతను చూశారు. ఏడురంగులూ చక్కగా నిలువు గీతల్లా కనిపిస్తున్నాయంటూ రెండో అతనికిచ్చారు. మూడో అతను గూడ చూశారు. మార్కులు వేసుకొని వెళ్లిపోయారు. తరువాత డి.ఇ.ఓ గారు వచ్చారు. బాలరాజు గోడమీద కాందం అడ్డుకోత పటం వేసి వుంచాడు. చాలా సేపు చూశారు. ఎపిడియాస్కోపు వెయ్యమన్నారు. తెరకీ ప్రొజెక్టరుకీ కనీసం ఐదడుగులైనా వుండాలి. మాకు వేరే గదిలేదు అన్నాడు బాలరాజు. పని చేసే విధానం చూపించాడు. నువ్వు చేశావా అని అడిగారు. కాదు మా మాస్టరుగారు చేశారు అని చెప్పాడు. గంట తరవాత ఒక మేస్టారు గారు వచ్చారు. దీని పేరేంటి? అని అడిగారు. మల్టీ ప్రొజక్టర్. అంటే ఎపిడియాస్కోపు, ఫిల్మ్‌స్ట్రిప్ ప్రొజెక్టర్, స్లైడ్ ప్రొజక్టర్, మైక్రో ప్రొజక్టరు. మా టీచర్ చేశారు అని చెప్పాడు బాలరాజు. నీ పేరేంటి అని అడిగి ఆడిపేరు, క్లాసు రాసుకొన్నారు.

డి.ఇ.ఒ.గారు మెచ్చుకున్నారు. అని తెలిసిన తరువాత చాలామంది ఉపాధ్యాయులు చూడడానికి వచ్చారు. "రామారావుగారు చెప్పకపోయేటట్లయితే ఒకగొప్ప ఐటమ్‌ని మిస్సయి వుండేవాళ్లం. చాలా సింపులుగా వుంది. ఎంత ఖర్చయి వుంటుంది?"

"ఖర్చేం వుంటుందండీ ! అన్నీ పనికిరాని పారేసిన వస్తువులే. కార్ హెడ్‌లైట్ రిఫ్లక్టరు, కాలి పోయిన పెన్‌టార్చ్ బల్బు, ప్లైవుడ్ చెక్కలు. పెట్టుబడి తక్కువ; శ్రమ ఎక్కువ. వారం రోజులు కష్టపడ్డాను. చిన్న పల్లెటూరు. ఏవీ ఆ వూర్లో దొరకవు. అన్నీ టౌన్‌నుండి తెచ్చుకోవలసిందే."

"అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకో వచ్చు. క్లాసులో ఎ.వి.ఇ. పాఠాలు చెప్పుకోవచ్చు. ఒకే ప్రొజక్టరులో ఇన్ని వుండవు. కొనాలంటే ఒక్కొక్కటీ వేలల్లో ఉంటుంది." అన్న హెడ్ మాస్టర్ వెంకట్రావు గారి మాటలు నన్ను ఆనంద పరవశుణ్ణి చేశాయి.

బెస్ట్‌టీచర్ ఎగ్జిబిట్ విషయంపై ఉపాధ్యాయుల మధ్య కొంత చర్చ జరిగింది. "రంగాచారి చాల కష్టపడ్డాడు. ప్రైజ్ కోసం బాగా ఖర్చు పెట్టాడు. మల్టీ ప్రొజక్టరుకు ఐన ఖర్చేంటి? దానిని ఎవరైనా కొంచం కష్టపడితే తయారు చేసిగలరు" అన్నారు డిజైన్ కాపీ చేసుకొన్న కొందరు సైన్సు మాస్టర్లు. "వాళ్ల ఎమ్.ఎల్.ఎ గారికి ఇది ప్రెస్టేజి క్వశ్చన్. తన స్కూలుకి ప్రెయిజ్ రావాలి. అంతే కాదు రంగాచారి ఎమ్.ఎల్.ఏ కి దూరపుచుట్టం. అందుకే హెచ్ ఎమ్‌కి ప్రత్యేకమైన ఏర్పాట్లు చెయ్యమని సిఫార్స్ లెటర్ గూడ ఇచ్చాడు." మరి కొందరి మనసులోని ఆలోచనలు.

మర్నాడు వెల్‌డిక్టరీ ఫంక్షన్. డి.ఇ.ఒ. గారు సైన్స్ ఫెయిర్ గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్య అతిథి జాయింట్ కలెక్టర్. ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ లోకల్ ఎమ్.ఎల్.ఎ సుభద్రమ్మగారు చేస్తున్నారు.

"బెస్ట్ టీచర్ ఎక్సిబిట్ – టెలిఫోన్ ఎక్చేంజ్ టి.పి.రంగాచార్యులు, సైన్సు అసిస్టెంటు, జి.జె.కాలేజి. ఇచ్ఛాపురం."

ప్రేక్షకులలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఇది అన్యాయం అని కొందరనుకొన్నారు. తరువాత విద్యార్థులకు బహుమతులు ప్రకటించారు.

"ముందుగా ఫిజిక్స్ విభాగంలో, ఫస్ట్ ప్రైజ్ మల్టీ ప్రొజక్టరు – కె. బాలరాజు – టెన్త్‌క్లాస్, జెడ్.పి. హైస్కూలు. సిగడాం." సమాన న్యాయం జరిగింది. బెస్టు ఐటిమ్స్ రెండింటికీ ఫస్టు ప్రయిజులొచ్చాయి. చాలామంచి జడ్జిమెంటు అంటూ టీచర్సు అందరూ ఏకగ్రీవంగా మెచ్చుకొన్నారు. ప్రైజ్ అందుకోడానికి బాలరాజు స్టేజిమీదకు వెళ్తున్నాడు. ప్రేక్షకులలో ఒకడు ఏడుస్తూ వెళ్లిపోవడాన్ని ఎవరూ గమనించలేదు. రమణకుమార్‌ని ఓదార్చడానికి నేను మాత్రం వాడి వెంటబడ్డాను.

## నానీలు

నేడు గెల్చిన వాడికి
రేపు గెలుపో, ఓటమో
గెలుపుపొగరు
పెంచొద్దు.

చేతికందని
వీధి వాసివి
చీకటి మీద దయతో మెరుస్తున్న
ఆకాశ పుష్పానివి.

నీ మనస్సు, దయ
మనిషికి లేదు
ఉన్నది 'చీమ'ంత
తెలివి ఆకాశమంత.

పచ్చగా ఉంటావు
నీ భాష నీదే
నీ లోకం నీదే
నీవు లేక లోకం లేదే.

నీవురుకుతావు
వెంట మేము
ఆగవా ఒక్క క్షణం
ఓ గడియారమా !

– రింకు